సాక్షి వరంగల్

శుక్రవారం | 5 | మే | 2023



క్రీస్తుసేవలో దేశానికే తలమానికం

ధర్మసాగర్ మండలం కరుణాపురంలో కొత్తగా నిర్మించిన క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరాన్ని గురువారం దైవజనులు పాల్సన్‌రాజు, జయప్రకాశ్‌లు ప్రారంభించారు. - 8లో▸



మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసిన పోలీసులు

పరకాల పోలీసులు మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసి బాగు చేయించారు. ఆ తరువాత అతన్ని తల్లికి అప్పగించారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0⁰ /24.0⁰

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కొద్దిమేర పెరిగి ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

కోదండరాంను అరెస్టు చేయడం సిగ్గుచేటు



వర్ధన్నపేట: ప్రొఫెసర్ కోదండరాంను అరెస్టు చేయడం సిగ్గుచేటని తెలంగాణ జన సమితి పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలికాల రాజేశ్ అన్నారు. మండల పరిధిలోని ఇల్లంద గ్రామంలో దెబ్బతిన్న పంటలను ఆయన గురువారం పరిశీలించి మాట్లాడారు. తెలంగాణలో అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. నష్టపరిహారం ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేయాలని సచివాలయంలో చీఫ్ సెక్రటరీకి వినతిపత్రం అందజేయడానికి వెళితే టీజేఎస్ అధినేత కోదండరాంను, ఇతర ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేయడం అన్యాయం అన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు దోమ రమేష్, దళిత నాయకులు తాళ్లపెల్లి ఐలయ్య రైతులు పాల్గొన్నారు.

రేపు ఆహార శుద్ధి యంత్ర పరికరాల ప్రదర్శన

కరీమాబాద్: హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం ఆహార శుద్ధి యంత్ర పరికరాల ప్రదర్శన నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి నరసింహస్వామి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ, తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆహార శుద్ధి పరిశ్రమలకు కావాల్సిన ఆధునిక యంత్ర పరికరాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించనున్నట్లు సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ జిల్లాల డీఆర్‌డీఏ, మెప్మా, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల అధికారులు పాల్గొంటారని వివరించారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు చెందిన ఔత్సాహికులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఫుడ్ ప్రాసెసింగ్ దరఖాస్తుదారులు, దళిత బంధు లబ్ధిదారులతో పాటు ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు హాజరై యంత్ర పరికరాల వినియోగం, ఉపయోగం గురించి అవగాహన పెంపొందించుకోవాలని నరసింహస్వామి కోరారు.

రేపటి నుంచి బదిలీలకు దరఖాస్తులు

కాశీబుగ్గ సెంటర్: సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో నడుస్తున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న స్పెషల్ ఆఫీసర్, పీజీసీఆర్‌టీ, సీఆర్‌టీ, ఏఎన్‌ఎం, అకౌంటెంట్, పీఈటీలు ప్రస్తుతం ఉన్న కేజీబీవీ నుంచి ఇతర కేజీబీవీలకు మార్పుకోరే అభ్యర్థులకు రేపటి(6వ తేదీ) నుంచి తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీఈఓ వాసంతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బదిలీ కోరే అభ్యర్థులు సమగ్రశిక్షా http://transfers.cdse.telangana.gov.in/ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు కావాల్సిన సమగ్ర వివరాలు, సూచనలు, మార్గదర్శకాలు కూడా పై వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు వివరించారు.

విద్యుత్ ప్రమాదాలు తగ్గించాలి

ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్‌రావు



హన్మకొండ: విద్యుత్ ప్రమాదాలు తగ్గించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. విద్యుత్ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం హనుమకొండ రాంనగర్‌లోని నిత్య బాంక్వెట్ హాల్‌లో హనుమకొండ టౌన్ డివిజన్ పరిధిలోని ఏడీ, ఏఈ, ఏఏఈ, ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్, ఆర్టిజన్ ఉద్యోగులకు విద్యుత్ ప్రమాదాలపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ విధులు నిర్వర్తించే సమయంలో ఎర్త్ రాడ్స్ వాడాలన్నారు. వినియోగదారులు తమ ఇంట్లో సొంతంగా విద్యుత్ రిపేర్లు చేయకూడదన్నారు. వినియోగదారులు నాణ్యమైన, స్టార్ రేటెడ్ విద్యుత్ పరికరాలను వాడాలన్నారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ సాయి కృష్ణ సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు శాంతి స్వరూప్ మానసిక ఒత్తిడి ఎలా తగ్గించవచ్చునో వివరించారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ పి.మోహన్ రెడ్డి, హనుమకొండ ఎస్ఈ కె.వెంకటరమణ, డీఈ జి.సాంబరెడ్డి , ఏడీఈలు నార్ల సుబ్రమణేశ్వర్‌రావు, పి.మల్లికార్జున్, పి.కిషన్ పాల్గొన్నారు.

కేటీఆర్ సారూ.. జర చూడరూ!

- కలెక్టరేట్ నిర్మాణంలో జాప్యం
- మామునూరు ఎయిర్‌పోర్టు స్థల సేకరణలోనూ అదే పరిస్థితి
- ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణంపైనా అధికారులకు దిశానిర్దేశం చేయాలి
- మంత్రి కేటీఆర్ పర్యటన వేళ.. ఇవీ పరిష్కరించాలంటున్న జనం



వరంగల్ నాయుడు పెట్రోల్ పంపు నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు దుస్థితి



సాక్షి, వరంగల్: రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఉమ్మడి వరంగల్ పర్యటన నేపథ్యంలో వరంగల్ జిల్లాలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా వరంగల్ జిల్లా పరిపాలన సేవలకు శాశ్వత భవనంతో పాటు మామునూరు ఎయిర్‌పోర్టు స్థలసేకరణ విషయాన్ని పరిష్కరించాలంటున్నారు. అలాగే వరంగల్ నగరంపై ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించేందుకు ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

కలెక్టరేట్ భవన నిర్మాణ పనుల్లో జాప్యం

వరంగల్ జిల్లా పరిపాలన సేవలకు శాశ్వత పరిపాలన భవనం నిర్మాణం విషయంలో అడుగు ముందుకుపడటం లేదు. ఈ ఏడాది మార్చి 9వ తేదీన చేనేత జౌళి శాఖకు చెందిన అజంజాహి మిల్లులోని 20.32 ఎకరాలను రెవెన్యూ విభాగానికి బదిలీ చేసేందుకు అనుమతినిచ్చినా.. ఇప్పటివరకు నిర్మాణ పనుల విషయంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో సమీకృత జిల్లా



వరంగల్ కలెక్టరేట్ కార్యాలయం కట్టేందుకు ప్రతిపాదించిన స్థలం

కార్యాలయాల సముదాయం నిర్మాణంలో జాప్యం జరుగుతుందనే మాటలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో మంత్రి కేటీఆర్ చొరవ చూపాలని, ఇది అందుబాటులోకి వస్తే ప్రజలకు సేవలు త్వరగ అందుతాయన్న మాట జనాల నుంచి వస్తోంది.

విమానాశ్రయం పనుల్లో..

చిన్న నగరాలను రాష్ట్ర రాజధానులు, దేశ రాజధానులతో కలిపేందుకు కేంద్ర ప్రభుత్వం 2016లో ఉడాన్ (ఉడో దేశ్‌కీ ఆమ్ నాగరిక్) పథకం కింద మామునూరు విమానాశ్రయాన్ని గతేడాది సెప్టెంబర్‌లో ఎంపిక చేసింది. పెద్దపల్లి జిల్లా బసంత్ నగర్, మామునూరు విమానాశ్రయాన్ని 'పర్యాటక ప్రాంతాలకు సమీపంలో ఉన్న విమానాశ్రయాల' కింద ఉడాన్ పథకం 5.0లో చోటు కల్పించింది. దేశం మొత్తం 54 పొటెన్షియల్ ఎయిర్‌స్ట్రిప్‌లను కేంద్రం గుర్తించిన సంగతి తెలిసిందే. అయితే వరంగల్ విమానాశ్రయ అభివృద్ధికి ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ ప్రకారం ఫేస్–1 కింద 179.41 ఎకరాలు, ఫేస్–2 కింద 264.45 ఎకరాల భూమి సేకరించి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికీ ఆ భూమిని ఏఏఐ పేరు మీదకు బదిలీ కాకపోవడంతో విమానాశ్రయం పనుల్లో ఆలస్యం అవుతుందన్న వాదన ఉంది. ఈ విషయంలో మంత్రి కేటీఆర్ చొరవ చూపి త్వరితగతిన పరిష్కరించాలని వరంగల్ వాసులు కోరుతున్నారు.

మొదలు కాని ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు

వరంగల్ నాయుడు పెట్రోల్ బంక్ నుంచి ఆరెపల్లి దామెర క్రాస్ రోడ్డు వరకు నిర్మించాల్సిన ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు ఏళ్లు గడుస్తున్నా ఇంకా మొదలుకాలేదు. భూనిర్వాసితులందరికీ పరిహారం పూర్తిస్థాయిలో అందకపోవడం కూడా నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడానికి మరో కారణంగా కనబడుతోంది. దీనిపైనా కూడా మంత్రి కేటీఆర్ దృష్టి సారించాలని.. ఇది అందుబాటులోకి వస్తే నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని, ప్రమాదాలు కూడా తగ్గుతాయని ప్రజలు కోరుతున్నారు.

నేడు వరంగల్ నగరంలో మంత్రి కేటీఆర్ పర్యటన

- మధ్యాహ్నం 2.45 గంటల నుంచి రాత్రి వరకు కార్యక్రమాలు
- రూ.181.45 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- వరంగల్, హనుమకొండలలో పార్టీ కార్యకర్తలతో సమావేశాలు
- సాయంత్రం కాజీపేట సెయింట్ గాబ్రియల్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగసభ

సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్ర ఐటీ, పురపాలక, పరిశ్రమలశాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) శుక్రవారం వరంగల్ నగరంలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ మేరకు పార్టీ యంత్రాంగం, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హనుమకొండ ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్, క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, సీపీ, ఇతర శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. కేటీఆర్ పర్యటన సందర్భంగా మహానగరంలో బందోబస్తు, భద్రత ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ పర్యవేక్షించారు. కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు భారీగా ఏర్పాట్లు చేశారు. పార్టీ జెండాలు, స్వాగత తోరణాలు, బ్యానర్లతో హసన్‌పర్తి నుంచి మడికొండ వరకు రోడ్లన్నీ గులాబీమయమయ్యాయి.

ఏర్పాట్ల పరిశీలన..

కేటీఆర్ పాల్గొనే కార్యక్రమాల ఏర్పాట్లను గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అరూరి రమేష్, సీపీ ఏవీ రంగనాథ్, కలెక్టర్‌లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య తదితరులు పరిశీలించారు. కిట్స్ కళాశాల, సమ్మయ్య నగర్ మోడల్ వైకుంఠ ధామం, సైన్స్ సెంటర్, ఫాతిమా నగర్‌లోని సమావేశ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



కేటీఆర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి దయాకర్‌రావు, వినయ్, కలెక్టర్లు, తదితరులు

కేటీఆర్ పర్యటన ఇలా..

- శుక్రవారం మధ్యాహ్నం 2.45గంటలకు హుస్నాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా హసన్‌పర్తి కిట్స్ కళాశాల ఆవరణకు చేరుకుంటారు.
- 2–45 నుంచి 4–30 వరకు ఆ కళాశాలలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభించి ఎగ్జిబిట్లను పరిశీలిస్తారు, హెచ్ఓడీలు, విద్యార్థులతో ఇంటరాక్షన్, కేసీఆర్ కప్ ప్రదానోత్సవం ఉంటుంది.
- 4.30 గంటలకు హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమంలో పాల్గొంటారు.
- సాయంత్రం 5 గంటలకు లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ స్కూల్లో సైన్స్‌పార్క్ ప్రారంభం, పలు అభివృద్ధి /ఐటీ శంకుస్థాపనలు చేస్తారు.
- 5.30 గంటలకు వరంగల్ నాయుడు పెట్రోల్ పంప్ వద్ద పార్టీ కార్యకర్తలతో సమావేశం
- 6 గంటలకు హనుమకొండ ఇందిరానగర్‌లోని రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకన్న ఇంటికి చేరుకుంటారు.
- 6.15 గంటలకు నగరంలోని 57వ డివిజన్ గాంధీనగర్‌లోని మోడల్ వైకుంఠధామం ప్రారంభోత్సవం
- 6.30 గంటలకు సెయింట్ గాబ్రియల్ స్కూల్ మైదానంలో బహిరంగ సభ
- రాత్రి 8.00 గంటలకు రోడ్డుమార్గాన హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సంగెం: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నల్లబెల్లి గ్రామంలో రూ.1,24,81,000 కోట్లతో చేపట్టిన ఈద్గా, ఖబరస్తాన్‌ల ప్రహరీ, మహిళల భవనాలకు శంకుస్థాపన, పల్లె ప్రకృతి వనం, శ్మశాన వాటిక, అంతర్గత సీసీ రోడ్లు, 500 మెట్రిక్ టన్నుల గోదాం , మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. మహిళా సంఘాలకు సబ్సిడీ ట్రాక్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ధర్మారెడ్డి మాట్లాడారు. కేసీఆర్ సీఎం కావడం రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోని పథకాలు అమలు చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా పారదర్శకంగా అమలు చేస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రైతు బంధు, రైతు బీమా, నాణ్యమైన విద్యుత్, పంట నష్టపరిహారంతో రైతులు ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నారన్నారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా డీసీసీబీ పనిచేస్తుందని తెలిపారు. జిల్లాలోని 51 పీఏసీఎస్‌లకు 129 పనులకు గాను నాబార్డు ద్వారా రూ.46 కోట్ల నిధులు కేటాయించామన్నారు. వీటిలో ఇప్పటి వరకు 94 పూర్తి కాగా రూ.22 కోట్లు చెల్లించామన్నారు. దీంతో సహకార సంఘాల ఆస్తులు, ఆదాయం పెరిగి బలోపేతం అవుతున్నాయన్నారు. డీసీసీబీ అతి తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తు రైతులు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తుందని తెలిపారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి, డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు

పంట వేయని వారికి పరిహారంపై నిలదీత

2022 జనవరిలో వడగళ్ల వానకు పంటల నష్టపోయిన వారికి కాకుండా పంటలు వేయని వారికి పరిహారం ఇచ్చారని రైతు పొన్నాల శ్రీకాంత్‌తో పాటుగా పలువురు ఏఈఓ రాజేందర్‌తో వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే ధర్మారెడ్డి మాట్లాడుతుండగా పరిహారం ఇవ్వలేదని అడుగుతుండడంతో పోలీసులు శ్రీకాంత్‌ను బయటకు నెట్టుకెళ్లడంతో పంట నష్టపోయి పరిహారం రాకపోతే అడిగేహక్కు లేదా అంటూ పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ మామిడాల సుదర్శన్, ఎంపీటీసీ కట్ల సుమలత, కోఆప్షన్ సభ్యులు మన్సూర్ అలీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సారంగపాణి, పీఏసీఎస్ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్

- జిల్లాలో 180 మత్స్య సహకార సంఘాలు
- అధికారుల పర్యవేక్షణలో మత్స్యకారులకు వృత్తి పరీక్షలు
- 49 సంఘాల్లో కొత్తగా 1,805 మందికి సభ్యత్వ అవకాశం



వల విసురుతున్న మత్స్యకారుడు(ఫైల్)

కరీమాబాద్: మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో మత్స్య సహకార సంఘాల సొసైటీల్లో కొత్త సభ్యత్వాల నమోదుకు అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నీటి వనరుల ఆధారంగా శాశ్వత, తాత్కాలిక సభ్యత్వాల ప్రాతిపదికన సభ్యుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే సభ్యత్వం కీలకం కానున్న నేపథ్యంలో అధికారులు వృత్తి పరమైన పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన వారి జాబితాను రాష్ట్ర కమిషనర్‌కు పంపి సభ్యులను ప్రకటించనున్నారు. ఒకటి, రెండు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని తెలుస్తుంది.

180 సొసైటీలు..1805 మంది ఎంపిక

జిల్లాలో 13 మండలాల పరిధిలో 180 మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలుండగా వాటిలో 14,218 మంది సభ్యులున్నారు. ఇప్పటి వరకు ఆయా సంఘాల్లో సభ్యత్వం ఉన్నవారికి ప్రభుత్వ పరంగా లబ్ధి చేకూరుతోంది. దీంతో జిల్లాలోని 49 సంఘాల్లో కొత్తగా సభ్యులను చేర్చుకునే అవకాశం లభించడంతో మత్స్య శాఖ అధికారులు ఆయా గ్రామాల చెరువుల్లో సభ్యులకు వృత్తి పరమైన పరీక్షలు నిర్వహించారు. 1805 సభ్యులను ఎంపిక చేశారు.

శాశ్వత, తాత్కాలిక ప్రాతిపదికన పరీక్షలు

మత్స్య పారిశ్రామిక సంఘాల పరిధిలో ఉన్న చెరువులలో కొత్తగా సభ్యత్వం పొందే వారికి ఆయా గ్రామాల్లోని చెరువుల్లో వృత్తి పరమైన పరీక్షలు నిర్వహించారు. నీటి వనరుల సామర్థ్యాన్ని బట్టి శాశ్వత, తాత్కాలిక సభ్యత్వం ప్రాతిపదికన మత్స్యకారుల ఎంపిక చేపట్టనున్నారు. నీటి వనరుల ఆధారంగా నీరు ఎప్పటికి ఉండే చెరువుల్లో 1 ఎకరానికి ఒకరు, 8 నుంచి 9 నెలల నీటి వనరులుండే చెరువుల్లో 2 ఎకరాలకు ఒకరు చొప్పున ఎంపిక చేస్తారు.

వృత్తి పరీక్ష విధానం

శాశ్వత సభ్యత్వం కోసం ఈత కొట్టడం, విసురు వల విసరడం, తెప్పపై వెళ్లి కచ్చు వల వదలడం, వల అల్లడం లాంటివి చేయాలి. తాత్కాలిక సభ్యత్వం కోసం ఈత కొట్టడం, విసురు వల విసరడం, పెద్ద వల గుంజడం లాంటి పనులు రావాలి.



చెరువులో ఈత కొడుతున్న మత్స్యకారులు(ఫైల్)



సొసైటీ భవనం ముందు మత్స్యకార్మికులు(ఫైల్)

మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలి



మత్స్యకారులు సామాజికంగా, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. నీటి వనరుల ఆధారంగా వృత్తి పరీక్షలు నిర్వహించి 1805 మంది కొత్త సభ్యులను ఎంపిక చేశాం. జాబితాను రాష్ట్ర కమిషనర్‌కు పంపించి అనుమతులు రాగానే సంఘాల్లో సభ్యత్వం కల్పిస్తాం.

- పి.నరేశ్‌కుమార్ నాయుడు, జిల్లా మత్స్యశాఖ అధికారి

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నెక్కొండ : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తోందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రెడ్లవాడ పీఏసీఎస్ పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించి మాట్లాడారు. ఏ గ్రేడ్ ధాన్యం రూ.2,060, కామన్ గ్రేడ్ ధాన్యం రూ.2,040 ధరలకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతు పండించిన ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వం కొంటుందని, దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ ఉషాదయాళ్, ఏఓ నాగరాజు, రెడ్లవాడ పీఏసీఎస్ చైర్మన్ జలగం సంపత్‌రావు, ప్రజా ప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



నెక్కొండ : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నిరుద్యోగుల జంగ్ సైరన్‌కు తరలిరండి

డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: ఈ నెల 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్న నిరుద్యోగ జంగ్ సైరన్ భారీ బహిరంగ సభకు జిల్లానుంచి యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండలోని డీసీసీ భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లక్షలాది మందితో నిర్వహించే జంగ్‌సైరన్‌కు ముఖ్య అతిథిగా ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీ హాజరువుతున్నట్లు తెలిపారు. కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటివరకు 51 నెలలకుగాను ఒక్కో నిరుద్యోగికి రూ.1.60 లక్షల నిరుద్యోగ భృతి ఈ ప్రభుత్వం బాకీ ఉందన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ఎందుకు భర్తీ చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎంపీ రాజయ్య, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, నాయకులు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయిని రాజేందర్‌రెడ్డి

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థినికి అవార్డు అందజేస్తున్న నిట్ డైరెక్టర్

కాజీపేట అర్బన్: విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ తెలిపారు. విద్య, కల్చరల్ ఈవెంట్స్‌లో ప్రతిభ కనబరిచిన ఫైనలియర్‌కు చెందిన 29మంది విద్యార్థులకు నిట్ సెమినార్ హాల్‌లో గురువారం ఆయన చేతులమీదుగా ఎండోమెంట్ అవార్డు, నగదు పురస్కారాల ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచస్థాయిలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు నిట్ అల్యూమ్ని ఎండోమెంట్ పేరిట అవార్డులు, నగదు పురస్కారాలను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీన్ ఉమామహేష్, రిజిస్ట్రార్ గోవర్ధన్ రావు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఓరియంటేషన్ వర్క్‌షాప్ ప్రారంభోత్సవం

నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్‌లో గురువారం ఉన్నత్ భారత్ అభియాన్ విభాగం ఆధ్వర్యంలో ఐదు రోజుల ఓరియంటేషన్ వర్క్‌షాప్‌ను డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉన్నత్ భారత్ అభియాన్ కోఆర్డినేటర్ వీరేందర్‌కుమార్ పాల్గొన్నారు.

భూ దందాపై డీసీపీ విచారణ

- హరిహర ఎస్టేట్ కాలనీ సందర్శన
- ఇరు వర్గాల నుంచి వివరాల సేకరణ
- పిలిచినప్పుడు పత్రాలతో రావాలని ఆదేశం

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం గొర్రెకుంట రెవెన్యూ శివారు హరిహర ఎస్టేట్ కాలనీలో జరుగుతున్న భూ దందా, ఆక్రమణలపై పోలీస్‌శాఖ దృష్టి సారించింది. కాలనీ వాసులు తమకు జరుగుతున్న అన్యాయం గురించి మీడియాకు వివరించిన విషయం పలు పత్రికల్లో ప్రచురితం కావడంతో పాటు అప్పటికే గీసుకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు అందడంతో ఈస్ట్‌జోన్ డీసీపీ పి. కరుణాకర్ స్పందించారు. గురువారం ఉదయం మామునూరు ఏసీపీ కృపాకర్, గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు, ఎస్సై వెంకన్నతో కలిసి డీసీపీ హరిహర ఎస్టేట్ కాలనీలో నిర్మించిన గృహాలు, ప్లాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు దారా ప్రవీణ్ , కొందరు కాలనీ వాసులతో మాట్లాడి వారి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు. అలాగే ఆక్రమణదారులుగా కాలనీ వాసులు ఆరోపిస్తున్న ఆడెపు మార్కండేయ, అతడి అనుచరులు పుచ్చకాయల బుచ్చిరెడ్డి, రెముడాల దామోదర్‌రెడ్డి, వేముల వెంకట సత్యనారాయణ, గూడెల్లి శ్రీనివాస్, ఆడెపు రమేశ్‌లతో పాటు కొందరి నుంచి వివరాలు సేకరించారు. హరిహర ఎస్టేట్ పేరుతో 'కుడా' లేఅవుట్ చేసి ప్లాట్లను విక్రయించిన మాజీ కుడా చైర్మన్ హరిహరప్రసాద్‌కు ఫోన్ చేసి రమ్మని కోరగా ఆయన కోర్టులో ఉన్నానని, ఆ తర్వాత వస్తానని సమాధానం ఇచ్చారని చెబుతున్నారు. ఇది ఇలా ఉండగా ఇళ్లు నిర్మించుకుని కాపురం ఉంటున్న కాలనీ వాసులను ఇబ్బంది పెట్టవద్దని డీసీపీ ఆడెపు మార్కండేయ, అతడి అనుచరులను ఆదేశించారు. రెండు మూడు రోజుల్లో పిలుస్తామని, ఇరు వర్గాల వారు తమ భూమి పత్రాలను తీసుకుని రావాలని డీసీపీ వారిని ఆదేశించినట్లు ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.



భూమి పత్రాలను పరిశీలిస్తున్న డీసీపీ కరుణాకర్

జాతీయ యూత్ పార్లమెంటుకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థి

కేయూ క్యాంపస్: ఈనెల 9న న్యూఢిల్లీలో జరగబోయే జాతీయస్థాయి యూత్ పార్లమెంటు క్యాంపునకు ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల విద్యార్థి అభిషేక్ ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం కళాశాలలో అభిషేక్‌ను ప్రిన్సిపాల్ అయిలయ్య, హనుమంతు, శ్రీదేవి, కనకయ్య అభినందించారు.

కాజీపేట జంక్షన్‌లో రైల్వే సేఫ్టీ ఆఫీసర్ తనిఖీలు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో గురువారం దక్షిణ మధ్య రైల్వే చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్ఓ) రవీంద్రనాథ్‌రెడ్డి తనిఖీలు చేపట్టారు. రైల్వే డ్రైవర్ల కార్యాలయం, డ్రైవర్ల విశ్రాంతి కార్యాలయం, డిప్యూటీ స్టేషన్ మాస్టర్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం రైల్వే యార్డులో రైలు ప్రమాదాలు జరిగితే యుద్ధప్రాతిపదికన తరలివెళ్లే యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్, ఎంఆర్‌వీ ట్రైన్‌ను సందర్శించి అందులోని అన్ని యంత్ర సామగ్రి, పరికరాలు సక్రమంగా ఉన్నాయా? లేదా అని పరిశీలించి తెలుసుకున్నారు. అనంతరం కాజీపేట రైల్వే అధికారులతో పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో కాజీపేటకు చెందిన వివిధ రైల్వే విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రేపు విజ్ఞానోత్సవ్

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 6న కళాశాల విజ్ఞానోత్సవ్–23ను నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య గురువారం తెలిపారు. ఆడిటోరియంలో నిర్వహించే ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేయూ వీసీ తాటికొండ రమేశ్, శాసనమండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగ్ కలెక్టర్ పి.ప్రావీణ్య, కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్, గాయకుడు జయరాజ్, బలగం సినిమా నటుడు అరసం మధుసూధన్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షల ఫీజు చెల్లించాలి

కేయూ క్యాంపస్: కేయూలోని వివిధ విభాగాల పరిశోధకులు ప్రీ పీహెచ్‌డీ పరీక్ష ఫీజు చెల్లించేందుకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.జ్యోతి తెలిపారు. ఫీజు రూ.930 అని, అపరాధ రుసుము లేకుండా ఈ నెల16వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించుకోవచ్చని పేర్కొన్నారు.

‘భగీరథ’ నీటితో వ్యాపారం!

- కళ్లెం సమీపంలో భారీ వాటర్ ప్లాంట్
- రోజుకు లక్ష లీటర్ల నీళ్ల అనుమతికి దరఖాస్తు
- పరిశ్రమల నిబంధన పేరుతో వాటర్ బాటిళ్ల తయారీ కంపెనీకి అనుమతులు?


కళ్లెం సమీపంలో ఏర్పాటు చేసిన భారీ వాటర్ ప్లాంట్

లింగాలఘణపురం: ప్రభుత్వం ఇంటింటికీ శుద్ధి చేసిన తాగునీరు అందించాలనే లక్ష్యంతో మిషన్ భగీరథను ప్రారంభించింది. ఈ నీటితో వ్యాపారం చేసేందుకు లింగాలఘణపురం మండలం కళ్లెం సమీపంలో భారీ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. రోజుకు లక్ష లీటర్ల నీటిని తీసుకునేందుకు అనుమతి కోసం రూ.26 లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. వేసవిలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తాగునీటికి తిప్పలు పడుతున్న నేపథ్యంలో వాటర్ బాటిళ్ల తయారు చేసుకునేందుకు రోజుకు లక్ష లీటర్ల నీటిని ఇచ్చేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పూర్తి స్థాయిలో శుద్ధి చేసి నీటిలో ఉండాల్సిన లవణాల శాతం(టీడీఎస్)ను తీసుకొచ్చి నేరుగా ప్రజలు తాగేందుకు సిద్ధమైన నీటిని వాటర్ బాటిళ్ల తయారీ కంపెనీకి అమ్మడమేంటో అర్థం కావట్లేదు.

బోర్లలో సరిపడా నీళ్ల రాక.

ఈభారీ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు సదరు కంపెనీ యాజమాన్యం స్థలాన్ని కొనుగోలు చేసి అందులో బోర్లు వేసింది. నీళ్లు సరిగ్గా పడకపోవడంతో మిషన్ భగీరథ నీటి కోసం దరఖాస్తు చేసుకుంది. నిర్వాహకులు అందుకు సంబంధించిన పైపులైన్‌లు కూడా వేసుకున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే.. రోజుకు లక్ష లీటర్ల నీరు తీసుకునేందుకు అక్కడే మీటర్లను బిగించి ఓ వ్యక్తిని కూడా నియమించినట్లు సమాచారం.

పరిశ్రమలకు పది శాతమే అనుమతి..

మిషన్ భగీరథ నీటిలో పది శాతం పరిశ్రమలకు ఇచ్చేందుకు అనుమతి ఉందనే నిబంధనపై వాటర్ ప్లాంట్‌కు రోజూ లక్ష లీటర్లు ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకున్నారు. పరిశ్రమలంటే ఏదైనా ఉత్పత్తి రంగానికి సంబంధించిన ఫ్యాక్టరీ అయ్యి ఉండాలి. ఇక్కడ మాత్రం కేవలం వాటర్ బాటిళ్లు తయారు చేసే కంపెనీలకు మిషన్ భగీరథ నీరు అనుమతి ఇవ్వొచ్చా? అనే అంశం చర్చనీయాంశమైంది. పూర్తి స్థాయిలో శుద్ధి చేయబడి ఉండాల్సిన మినరల్స్ శాతం (టీడీఎస్) నీటిని సదరు కంపెనీ తీసుకొని అందులో మరిన్ని మినరల్స్ కలిపి వాటర్ బాటిళ్లను తయారు చేసి అమ్ముకోనుంది. ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తోంది.

ఆదాయం పెంచుకునేందుకు..

నిబంధన మేరకు ఇప్పటికే సదరు కంపెనీ యాజమాన్యం రోజూ లక్ష లీటర్ల నీటికి దరఖాస్తు చేసుకుంది. వెయ్యి లీటర్లకు రూ.90ల చొప్పున నీటిని ఇచ్చేందుకు ప్రభుత్వం నుంచి అనుమతికి ప్రతిపాదనలు పంపించాం. రాగానే.. అక్కడే మీటరు బిగించి ఇవ్వడం జరుగుతుంది.

– వి.శ్రీనివాసులు, ఈఈ, మిషన్ భగీరథ

నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకున్నాం..

నిబంధనల మేరకే మిషన్ భగీరథ నీటికి దరఖాస్తు చేసుకున్నాం. అందుకు సంబంధించి రూ.26 లక్షలు చెల్లించడం జరిగింది. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే.. నీటిని తీసుకుంటాం. భగీరథ నీటిలో మరిన్ని మినరల్స్ యాడ్ చేసి బాటిళ్లు తయారు చేయడం జరుగుతుంది.

– శ్రీనివాస్‌రెడ్డి, కంపెనీ మేనేజర్

నూతన జిల్లాల వారీగా ఖాతాల బదిలీ

హన్మకొండ: పరిపాలన సౌలభ్యానికి జిల్లాల పునర్విభజన, నూతన జిల్లాల ఏర్పాటుతో బోధన, బోధనేతర ఉద్యోగుల నూతన జిల్లాల కేటాయింపు ప్రక్రియ జరిగింది. పూర్వ వరంగల్ జిల్లా స్థాయిలో జిల్లా ప్రజాపరిషత్ ఉపాధ్యాయులు, ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాలు పూర్వ వరంగల్ జెడ్పీలో నిర్వహించారు. జిల్లాల పునర్విభజన జరిగినా పూర్వ జెడ్పీ స్థాయి నూడల్ జెడ్పీగా హనుమకొండ జెడ్పీ ఇప్పటి వరకు జీపీఎఫ్ ఖాతాల నిర్వహణ చూస్తోంది. నూతన జిల్లాల ఏర్పాటు ఉపాధ్యాయులు, ఉద్యోగుల కేటాయింపులు పూర్తి కావడంతో వారి సౌలభ్యం కోసం జిల్లాల వారీగా ఖాతాల విభజన చేపట్టారు. 10 ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి ఖాతాల విభజన ప్రక్రియ చేపట్టారు. నోడల్ సీఈఓ, హనుమకొండ జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్ రావు ఒక్కో టీమ్‌కు ఇద్దరు చొప్పున 10 టీమ్‌లు ఏర్పాటు చేశారు. ఈటీమ్‌లు నూతన జిల్లాల్లోని ఉపాధ్యాయులు, ఉద్యోగుల వారీగా ఖాతాల బదిలీ ప్రక్రియను చేపట్టారు. రెండు నెలల్లో ఈప్రక్రియను పూర్తి చేయనున్నారు. పూర్వ వరంగల్ జిల్లాలో 8,150 బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు. వీరి జీపీఎఫ్ ఖాతాలను జూన్ 30 వరకు నూతన జిల్లాలకు బదిలీ చేస్తారు. నూతన జిల్లాల వారీగా ప్రస్తుతం హనుమకొండ జిల్లాలో 1,679 మంది, వరంగల్‌లో 1,912, జనగామలో 1,827, మహబూబాబాద్‌లో 1,827, జేఎస్ భూపాలపల్లిలో 489, ములుగులో 476, సిద్దిపేట జిల్లాలో 294 సిబ్బంది ఉన్నారు.

లావాదేవీల నిలిపివేత

నూతన జిల్లాల వారీగా జీపీఎఫ్ ఖాతాల విభజన ప్రక్రియ పూర్తయ్యే వరకు లావాదేవీలు పూర్తిగా నిలిపేశాం. ఈనెల 1 నుంచి జూన్ 30 వరకు జీపీఎఫ్ పార్ట్ ఫైనల్, రుణాలు, అడ్వాన్స్‌లకు దరఖాస్తుల స్వీకరణ నిలిపివేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు సహకరించాలి.

– వెంకటేశ్వర్ రావు, జెడ్పీ సీఈఓ, హనుమకొండ

వృద్ధురాలిపై హత్యాయత్నం

- పరిస్థితి విషమం

కురవి: ఇద్దరు వృద్ధులు సహజీవనం చేస్తున్నారు. పది రోజుల నుంచి ఇద్దరికీ గొడవలు జరుగుతున్నాయి. కోపంతో 70 ఏళ్ల షేక్ ఖాజామియా అతడితో సహజీవనం చేస్తున్న 60 ఏళ్ల గుండగాని మంగమ్మని రోకలి బండతో తలపై మోది హత్యాయత్నం చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం తట్టుపల్లిలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్సై బి.రాము తెలిపిన వివరాల ప్రకారం.. తట్టుపల్లికి చెందిన గుండగాని మంగమ్మ 30 ఏళ్ల నుంచి అదే గ్రామానికి చెందిన షేక్ ఖాజామియాతో ఒకేఇంట్లో సహ జీవనం చేస్తోంది. కొన్ని నెలల నుంచి ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగమ్మ తనకు కళ్లు కనిపించడంలేదని, తన బిడ్డల వద్దకు వెళ్తానని ఖాజామియాతో చెప్పింది. దీంతో ఖాజామియా ఈసమయంలో తనను ఎవరు చూసుకుంటారని ఆమెతో గొడవకు దిగాడు. అయితే కొద్దిరోజుల క్రితం ఖాజామియా కొడుకులు వచ్చి ఇద్దరికీ సర్దిచెప్పారు. దీంతో ఖాజామియా ఆమెపై కోపంతో బుధవారం రాత్రి రోకలిబండతో తలమీద మోదాడు. దీంతో ఆమె తల పగిలిపోయింది. వెంటనే మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేశారు. అదే రాత్రి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. మంగమ్మ కుమార్తె రాంపల్లి రేణుక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

పెద్దవంగర: అప్పుల బాధతో వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన జక్కుల మంజుల(40) బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. పెద్దవంగర మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన మంజులకు ఇరవై ఏళ్ల క్రితం మైలారం గ్రామానికి చెందిన శ్రీనుతో వివాహం జరిగింది. వీరికి ఒక కూమారుడు, కుమార్తె. బ్రెయిన్ ట్యూమర్‌తో భర్త మూడేళ్ల క్రితం మృతి చెందాడు. భర్త చికిత్స సమయంలో మంజుల రూ. 3 లక్షల వరకు అప్పు చేసింది. తీసుకున్న అప్పులకు వడ్డీ పెరుగుతుండడం, కుటుంబ పోషణ భారమవడంతో మంజుల మనస్తాపం చెందింది. బుధవారం పుట్టింటికి వచ్చి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


యాకు (ఫైల్)

చిన్నగూడూరు: విద్యుత్ షాక్‌తో మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం తుమ్మల చెరువు తండా శివారు మల్యా తండాకు చెందిన మాలోత్ యాకు(42) గురువారం మృతి చెందాడు. యాకు వ్యవసాయం చేస్తుంటాడు. గురువారం తన ఇంటి మోటారు మరమ్మతు చేసే సమయంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. స్థానిక ఎస్సై సంతోశ్‌కుమార్ ఘటనాస్థలిని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధితకుటుంబానికి సానుభూతి తెలిపారు.

జ్వరంతో వ్యక్తి ..


రామ్‌కుమార్ (ఫైల్)

వాజేడు: జ్వరంతో బాధపడుతూ మండలంలోని కొంగాల గ్రామానికి చెందిన యాలం రామ్‌కుమార్(40) గురువారం మృతి చెందాడు. రామ్‌కుమార్ వారం నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. మందులు వాడడంతో జ్వరం తగ్గిందని భావించాడు. ఛత్తీస్‌గఢ్‌లో బంధువుల ఇంట్లో జరిగిన పెళ్లికి వెళ్లి మూడ్రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. బుధవారం రాత్రి అతడికి మళ్లీ జ్వరం వచ్చింది. గమనించిన బంధువులు భద్రాచలం ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యం చేస్తుండగానే రామ్‌కుమార్ మృతి చెందాడు.

అదనపు కట్నం కోసం వేధించిన ఒకరిపై కేసు

చెన్నారావుపేట: అదనపు కట్నం కోసం వేధించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట మహేందర్ గురువారం తెలిపారు. మండలంలోని తిమ్మారాయినిపహడ్ గ్రామానికి చెందిన దొనికేని స్వాతికి మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని కొమ్ములవంచకు చెందిన దొనికేని యాకయ్యతో 2012లో వివాహం జరిగింది. అప్పటి నుంచి యాకయ్యతో పాటు ఆయన కుటుంబ సభ్యులు అదనపు కట్నం తీసుకురావాలని స్వాతిని వేధింపులకు గురి చేస్తున్నారు. ఈవిషయంపై బాధితురాలు స్వాతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

శిశువును విక్రయించేందుకు యత్నం

- ఒకరిపై కేసు

రాయపర్తి: ఐదురోజుల ఆడ శిశువును విక్రయించేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గురువారం స్థానిక ఎస్సై బండారి రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సన్నూరు గ్రామానికి చెందిన గడ్డమీది యాకమల్లు ఓ మహిళతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. ఆ మహిళ ఐదు రోజుల క్రితం ఆడ శిశువుకు జన్మనిచ్చింది. యాకమల్లుకు ఇప్పటికే ఆడపిల్లలు ఉండడంతో శిశువును గురువారం విక్రయించేందుకు ప్రయత్నిస్తూ గ్రామ శివారులో కనిపించాడు. సమాచారం అందుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మోదె మాధవితోపాటు, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి కలిసి ఘటనా స్థలికి వెళ్లి శిశువును తల్లికి అప్పగించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మోరంచ వాగులో వ్యక్తి గల్లంతు


వెంకటేశ్ (ఫైల్)

చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్‌పాక గ్రామ శివారులో ఉన్న మోరంచ వాగును దాటుతూ ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు అందులో పడి గల్లంతయ్యాడు. ఈఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన కేతిరి వెంకటేశ్(30) ఈనెల 1న తన అత్తగారి గ్రామమైన గుడాడ్‌పల్లికి వెళ్తుండగా నైన్‌పాక శివారులో ఉన్న మోరంచపల్లి వాగు దాటుతూ ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. అతడి ఆచూకీ కోసం పోలీసులు మోరంచ పరిసరాల్లో గాలించినా ఫలితం లేదు. వెంకటేశ్ తండ్రి సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపారు. వెంకటేశ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

క్రీస్తు సేవలో దేశానికే తలమానికం


చర్చి ప్రారంభానికి వచ్చిన విశ్వాసులు


మందిరాన్ని ప్రారంభిస్తున్న దైవజనులు

ధర్మసాగర్: ఏసు క్రీస్తు ప్రార్థన మందిరం క్రీస్తు సేవలో దేశానికే తలమానికంగా నిలుస్తోందని కరుణాపురం క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరం వ్యవస్థాపకులు రెవరెండ్ డాక్టర్ సంగాల పాల్సన్‌రాజ్, రెవరెండ్ డాక్టర్ గోపు జయప్రకాశ్ అన్నారు. ధర్మసాగర్ మండలం కరుణాపురంలో నిర్మించిన క్రీస్తు జ్యోతి ప్రార్థన మందిరాన్ని గురువారం దైవజనులు పాల్సన్‌రాజ్, జయప్రకాశ్ కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆసియా ఖండంలో అతిపెద్ద చర్చిని కరుణాపురంలో నిర్మించడం దేవుని ప్రార్థన సంకల్పమేనన్నారు. జీవితాంతం దేవుడి సేవలో కొనసాగుతామన్నారు. యూఎస్ఏ ఇంటర్నేషనల్ స్పీకర్ రెవరెండ్ డాక్టర్ స్టీవ్ మున్సే బైబిల్ సందేశం ఇచ్చారు. పాల్సన్‌రాజ్, జయప్రకాశ్‌లు ప్రత్యేక వాహనంపై కేరళ బ్యాండ్ బృందంతో పోలీసుల బందోబస్తు, క్రీస్తు విశ్వాసులతో తమ ఇంటి నుంచి కరుణాపురం పురవీధుల మీదుగా క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరానికి చేరుకొని క్రీస్తు జెండాను ఆవిష్కరించారు. లక్షలాది మంది విశ్వాసులకు భోజనాలు ఏర్పాటు చేశారు. రెవ.డాక్టర్ ఎస్.జోసెఫ్ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, దైవజనుడు బ్రదర్ జడ్సన్ అబ్రహం, రెవ.డాక్టర్ కె.ఎం.జాన్, సేవాభారత్ ఫౌండర్ డాక్టర్ జె.చిరంజీవి, టీసీఎఫ్ ప్రెసిడెంట్ డాక్టర్ డి.ఐజక్, టీసీఎఫ్ చైర్మన్ బిషప్ జాన్‌మార్కెండేయ, పాస్టర్ ఎం.పరంజ్యోతి, పాస్టర్ టి.డేవిడ్, బి.వినయ్‌కుమార్, రెవ.నల్ల డేవిడ్, జి.ఎలిషా, రెవ.యు.డేవిడ్, పాస్టర్ కోర్నెల్, పాస్టర్ క్లింటన్, ఇమ్మానియేల్, రెవ.డాక్టర్ జె.థామస్, సంగాల డేవిడ్, పాస్టర్లు, దేశ నలుమూలల నుంచి ప్రజలు పాల్గొన్నారు.

లైన్ పెట్రోలింగ్ నిర్వహించాలి: ఎన్పీడీసీఎల్ సీఎండీ

హన్మకొండ: అధికారులు, ఉద్యోగులు లైన్ పెట్రోలింగ్ నిర్వహించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు సూచించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని క్యాంపు కార్యాలయం నుంచి ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల ఎస్ఈలు, డీఈ, ఏఈ, ఎస్ఏఓ, ఏఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రగతిని సమీక్షించారు. ఇందులో సీఎండీ గోపాల్‌రావు మాట్లాడుతూ.. 33 కేవీ ఇంటర్ లింకింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. విధిగా సబ్‌స్టేషన్ల నిర్వహణ చేపట్టాలన్నారు. దత్తత గ్రామాల్లో గుర్తించిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని, పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎంలు సదర్‌లాల్, అశోక్‌కుమార్, మోహన్ రావు, రాజు చౌహాన్, రవీంద్రనాథ్, డీఈ ఐటీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వనరులను ధ్వంసం చేస్తున్న ప్రభుత్వం

- మావోయిస్టు పార్టీ జేఎంఎంపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్

మంథని: త్యాగాల ఫలితంగా ఏర్పడ్డ ప్రభుత్వం తెలంగాణలో ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు పోలీస్ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రతిపక్షాలు, ప్రజా ఉద్యమాలను కాలరాస్తోందని జయశంకర్–మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. అధికార పార్టీ రియల్ వ్యాపారుల లాభాల కోసం కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తీస్తున్నారని తెలిపారు. మిడ్ మానేరులో ఇసుకను తీయడంతో నీటి ఎద్దడి ఏర్పడి పంటలు పండవని కేసు వేసిన తర్వాత మైనింగ్ ఆపేసిందని పేర్కొన్నారు. అధికార పార్టీ అండదండలతో సుల్తానాబాద్, వీణవంక నుంచి గోదావరి కలిసే వరకు ఇసుకను తీసి అమ్ముతున్నారన్నారు. కాళేశ్వరం దగ్గర గోదావరిలో అక్రమంగా రోడ్డు పోసి ఇసుకను తీసుకెళ్తున్నారన్నారు. పెద్దపల్లి, జయశంకర్, ములుగు అడవులు, గుట్టలు, చెరువుశిఖం భూముల్లోని మట్టి తీసి రోడ్లు, ప్రభుత్వ భవనాలు, ఇళ్ల నిర్మాణాలకు అనుమతుల్లేకుండా కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదిస్తూ ప్రకృతిని ధ్వంసం చేస్తున్నారని స్పష్టం చేశారు.

‘నకిలీ’ ఉదంతానికి కేటీఆర్ బాధ్యత వహించాలి

- బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్


మాట్లాడుతున్న దాసు సురేశ్

పరకాల: నకిలీ చేనేత ఉదంతాన్ని ఇప్పటికే ఖండించిన మంత్రి కేటీఆర్ నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. పరకాల చేనేత సహకార సంఘ భవనాన్ని ఆయన గురువారం సందర్శించి చేనేత కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో వేల కోట్ల రూపాయల నకిలీ చేనేత దందాపై ప్రభుత్వం పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోందన్నారు. వరంగల్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు పట్టుబడిన షాపింగ్ మాల్‌ను మూసివేయించకుండా మంత్రి కేటీఆర్ వరంగల్‌కు ఎలా వస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ జిల్లా డైరెక్టర్ గాదె శంకరయ్య, చేనేత సహకార సంఘం సభ్యులు రాజేందర్, మార్త భిక్షపతి, దాసరి భిక్షపతి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి

- టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్


సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల రాజేందర్

హన్మకొండ అర్బన్: ఉద్యోగులకు కడిపికొండలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కొందరు కబ్జాదారులు చేస్తున్న అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం అడ్డుకొని, వారిపై చర్యలు తీసుకోవాలని టీఎన్జీఓస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆ సంఘం భవన్‌లో గురువారం జరిగిన యూనియన్ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఉద్యోగుల ఇంటి నిర్మాణాల కోసం కడిపికొండలో ప్రభుత్వం కేటాయించిన 32 ఎకరాల స్థలంలో కొందరు కబ్జాదారులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఈ నిర్మాణాలను వెంటనే అడ్డుకోవాలని, లేనిపక్షంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాల చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరి వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేశ్, కేంద్ర సంఘం నాయకులు శనిగరపు శ్యామ్‌సుందర్, రామునాయక్, సారంగపాణి, మొయిన్, లక్ష్మి ప్రసాద్, జిల్లా నాయకులు సలీం, చీకటి శ్రీనివాస్, రాజమౌళి, బింగి సురేశ్, రాజేశ్, ఖన్నా, రాజ్యలక్ష్మి, జయంతి, పావని, రజిత, కల్పన, రామ్‌ప్రసాద్, రాజీవ్, భరత్ పాల్గొన్నారు.

పిచ్చివాడైన కొడుకు.. తల్లడిల్లిన తల్లి హృదయం

- తట్టుకోలేక పోలీసులను ఆశ్రయించడంతో చేరదీసిన పోలీసులు
- వైద్యం ఇప్పించడంతో సాధారణ వ్యక్తిగా మార్పు


నరేశ్‌ను తల్లి సమ్మక్కకు అప్పగిస్తున్న పరకాల పోలీసులు

పరకాల: కట్టుకున్న భార్య కాపురానికి రాకపోవడంతో బాధపడుతూ కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా సంచరిస్తున్న యువకుడిని చేరదీసిన పరకాల పోలీసులు వైద్యం చేయించి సాధారణ వ్యక్తిగా మార్చారు. తిరిగి ఆ యువకుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలోకి వెళ్తే.. నడికూడ మండలం రాయపర్తి గ్రామానికి చెందిన కోడెపాక నరేశ్ దంపతుల మధ్య గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లి తిరిగిరాలేదు. భార్య రావడం లేదంటూ మనోవేదనకు గురైన నరేశ్ మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో సంచరిస్తూ ఉండేవాడు. కళ్ల ముందు కొడుకు అలా తిరుగుతుంటే తట్టుకోలేకపోయిన తల్లి సమ్మక్క పరకాల పోలీసులను ఆశ్రయించింది. పరకాల సీఐ పుల్యాల కిషన్ నరేశ్‌ను ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు. నరేశ్ వారం రోజులకు సాధారణ వ్యక్తిగా మారాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన అతడిని తిరిగి తల్లి సమ్మక్కకు అప్పగించడంతో ఆమెలో ఎనలేని సంతోషం కనిపించింది. తిరిగి తన కొడుకును ఇలా చూస్తానని అనుకోలేదని ఆమె కన్నీటి పర్యంతమైంది. ఎలాంటి సమస్య ఉన్నా పోలీసులు అండగా ఉంటారని సమ్మక్కకు సీఐ కిషన్, ఎస్ఐలు ప్రశాంత్‌బాబు, హరికృష్ణ, శివకృష్ణ ధైర్యం కల్పించారు. పరకాల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు ఆరుగురు మతిస్థిమితం లేని వ్యక్తులను ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేర్పించి సాధారణ వ్యక్తులుగా మార్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ పుల్యాల కిషన్ తెలిపారు.